సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం, 20, జూన్, 2024



నీరు పారేదెలా?

షామీర్‌పేట్ వాగు నుంచి చెరువులకు నీళ్లొచ్చే కాలువలు శిథిలమై, కంపచెట్లతో నిండి అధ్వానంగా మారాయి.

- 9లో



కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం

చేనేత సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ అన్నారు.

- 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 26°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎండ, ఉక్కపోత

భువనగిరి : వేసవి ముగిసినా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం లేదు. బుధవారం జిల్లాలో 38 డిగ్రీలపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంస్థాన్‌నారాయణపురంలో 38, యాదగిరిగుట్టలో 37.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. మిగతా మండలాల్లోనూ 35 డిగ్రీలకు పైనే ఎండకాసింది. ఎండకు తోడు ఉక్కపోత ఉండడంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు.

వెబ్ ఆప్షన్లకు నేడు అవకాశం

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా స్కూల్ అసిస్టెంట్లు బదిలీ కోసం శుక్రవారం ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ ఇచ్చుకోనున్నారు. జిల్లాలో 970 మంది ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావల్సి ఉంది. వీరిలో జూన్ 1నాటికి ఎనిమిదేళ్ల సర్వీస్‌తో పాటు రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారు కూడా బదిలీ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. సీనియార్టీ జాబితా ప్రకటించన వెంటనే బదిలీ కోసం వెబ్ ఆప్షన్ పెట్టుకోనున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ బీకునాయక్

భువనగిరిటౌన్ : క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ ధనావత్ బీకునాయక్ అధికారులకు సూచించారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో జరిగిన మూడో స్థాయీ సంఘ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సాగు రైతుల అవసరం మేరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. అక్కడక్కడ కల్తీ విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం ఉందని, అటువంటి వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. అదే విధంగా 5వ మహిళా,శిశు సంక్షేమ స్థాయీ సంఘం సమావేశంలో జెడ్పీటీసీ గోళి ప్రణీత మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తప్పనిసరిగా రోజూ పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. అలాగే పోషణ్ అభియాన్, ప్రీస్కూల్, సఖి కేంద్రం పనితీరు తీరుపై ప్రాజెక్టుల వారీగా సమీక్షించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ సుబ్బూర్ బీరు మల్లయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నృసింహుడికి నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టి స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ఆయ ముఖ మండపంలో అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

కలెక్టర్‌కు ఎస్పీ శుభాకాంక్షలు

నల్లగొండ: నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.నారాయణరెడ్డిని బుధవారం నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాసేపు వారు మాట్లాడుకున్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి మొక్క అందజేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

‘ధరణి’ దరఖాస్తులు తొమ్మిది వేలకు పైనే..

భూ సమస్యలపై అర్జీల వెల్లువ

- పరిష్కారానికి మార్చిలోనే స్పెషల్ డ్రైవ్
- ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన ప్రక్రియ
- కోడ్ ముగియడంతో మళ్లీ ప్రారంభించిన రెవెన్యూ యంత్రాంగం
- తహసీల్దార్ కార్యాలయాల్లో క్యాంపులు

సాక్షి, యాదాద్రి : ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ యంత్రాంగం మరోసారి దృష్టి సారించింది. ఇందుకోసం వారం రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. జిల్లాలో తొమ్మిది వేలకు పైనే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టర్ ఏరోజుకారోజు ఆర్డీఓలు, తహసీల్దార్ల ద్వారా దరఖాస్తుల పురోగతిని తెలుసుకుంటూ వారికి మార్గనిర్దేశం చేస్తున్నారు.

ఎన్నికలతో బ్రేక్

ధరణి దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారులు మార్చి నెలలోనే స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి జూన్ మొదటి వారం లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అయితే ఇదే సమయంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో అధికార యంత్రాంగం అంతా నిమగ్నం కావడంతో దరఖాస్తుల పరిశీలన నిలిచిపోయింది. కొన్ని దరఖాస్తులు మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. ఈ నెల 8వ తేదీన ఎన్నికల కోడ్ ముగియడంతో అధికారులు మరోసారి ధరణి దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించారు. ఇందుకోసం ప్రతి మండలానికి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ నేతృత్వంలో రెండు, మూడు బృందాలు ఏర్పాటు చేసి తహసీల్దార్ కార్యాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నారు. జీపీఏ, జీఎల్ఎం గ్రీవెన్స్ ల్యాండ్ మాటర్, ఖాతా మెర్జింగ్, కోర్టు కేసులతో పెండింగ్, పీడీసీ టీఎం-33, పోడు, మ్యుటేషన్, సెమీఅర్బన్ ల్యాండ్. ఇలా 12 రకాల మాడ్యూల్స్‌లో అర్జీలను పరిష్కరిస్తున్నారు. ఒక దరఖాస్తును ఆమోదించినా? తిరస్కరించినా? అందుకు కారణాలను రైతులకు స్పష్టం చేస్తున్నారు.



చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో ధరణి దరఖాస్తుల పురోగతిపై తెలుసుకుంటున్న కలెక్టర్

తహసీల్దార్ల స్థాయిలో భారీగా పెండింగ్

తహసీల్దార్ కార్యాలయ స్థాయిలో దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్త వారు వచ్చారు. నూతన తహసీల్దార్లు ధరణి దరఖాస్తుల పరిష్కారంపై పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎన్నికలు పూర్తికాగానే ఎలాగూ బదిలీ అవుతామన్న కారణంతో వాటిపై శ్రద్ధ చూపలేదన్న విమర్శలున్నాయి. దీంతో పాటు ధరణి పోర్టల్‌లో సాంకేతిక కారణాల వల్ల దరఖాస్తులకు మోక్షం కలగలేదు.

అత్యధికంగా ఈ మండలాల్లో..

బీబీనగర్, యాదగిరిగుట్ట, బొమ్మలరామారం, తుర్కపల్లి, వలిగొండ, సంస్థాన్‌నారాయణపురం, ఆలేరు, చౌటుప్పల్, రాజాపేట, భువనగిరి తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి.

కలెక్టర్ పర్యవేక్షణలో..

దరఖాస్తుల పరిష్కారానికి తహసీల్దార్ కార్యాయాల్లో కొనసాగుతున్న క్యాంపులను కలెక్టర్ హనుమంతు కే.జెండగే క్షేత్రస్థాయికి వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. ఏరోజుకారోజు ఆర్డీఓలు, తహసీల్దార్ల ద్వారా దరఖాస్తుల పురోగతిపై ఆరా తీస్తున్నారు. పొరపాట్లకు తావు ఇవ్వకుండా దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. కాగా దరఖాస్తుల్లో ధరణి పోర్టలత్ పాటు గ్రీవెన్స్, సీఎం కార్యాలయానికి నేరుగా వచ్చినవి కూడా ఉన్నాయి.

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

చౌటుప్పల్ : భూ సమస్యలపై ధరణి పోర్టల్ ద్వారా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే పేర్కొన్నారు. చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి ధరణి దరఖాస్తులను పరిశీలించారు. ధరణిలో వచ్చిన పాతీ కేసులు, మ్యుటేషన్లు తదితర దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఆమోదించినా, తిరస్కరించినా అందుకు కారణాలను రైతులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. త్వరితగతిన అర్జీలకు పరిష్కారం చూపాలని కోరారు. ఆయన వెంట ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సురేంద్రశర్మ పాల్గొన్నారు.

మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులు

మండలం	అర్జీలు	మండలం	అర్జీలు	మండలం	అర్జీలు
అడ్డగూడూరు	208	బీబీనగర్	934	యాదగిరిగుట్ట	930
ఆలేరు	645	బొమ్మలరామారం	805	పోచంపల్లి	372
ఆత్మకూర్(ఎం)	305	గుండాల	448	చౌటుప్పల్	577
భువనగిరి	547	మోటకొండూర్	362	నారాయణపురం	597
		మోత్కూర్	293	రామన్నపేట	166
		రాజాపేట	562	వలిగొండ	762
		తుర్కపల్లి	837	మొత్తం	9,350



సంస్థాన్‌నారాయణపురం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

మూతపడిన బడులను పునఃప్రారంభిస్తాం

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సంస్థాన్ నారాయణపురం : మారుమూల ప్రాంతాల్లోనూ విద్యార్థులకు విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే మూతపడిన పాఠశాలలను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. బుధవారం ఆయన సంస్థాన్‌నారాయణపురంలోని బాలికల జెడ్పీహెచ్ఎస్, గుడిమల్కాపురం పాఠశాలను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీపై విద్యార్థులను మాట్లాడి నిర్ధారణ చేసుకున్నారు. మధ్యాహ్న భోజనం, అల్పాహారం ఎలా ఉంటుందని అడిగారు. మంచిగా చదువుకోవాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా ఏమైనా చేయాల్సిన పనులు ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. బడిబాట విజయవంతం అయినట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన

సంస్థాన్‌నారాయణపురంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. రికార్డులు, ధరణి దరఖాస్తులను పరిశీలించారు.ధరణి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తహసీల్దార్లు, ఆర్డీఓలకు కూడా లాగిన్ ఇచ్చినందున త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. రాచకొండ భూ వివాదాలకు సంబంధించి ప్రభుత్వ ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అయన వెంట ఎంపీపీ గుత్త ఉమాదేవి, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, తహసిల్దార్ కృష్ణ, ఏపీఎం యాదయ్య, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, వీపీఓ నరేష్, నర్సింహ, రమేష్ తదితరలు ఉన్నారు.

బడిబయట పిల్లలు 3,459 మంది

- బడిబాట కార్యక్రమంలో గుర్తింపు
- పాఠశాలల్లో చేర్పించిన ఉపాధ్యాయులు

భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ అధికారులు ఈనెల 6వ తేదీ నుంచి చేపట్టిన బడిబాట బుధవారం ముగిసింది. 13 రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమం ద్వారా 3,459 మంది విద్యార్థులు బడిలో చేరినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉపాధ్యాయులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ కమిటీల సభ్యులు బడిబాటలో భాగస్వాములు అయ్యారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన పథకాలు, పాఠశాలల్లో సౌకర్యాలు, బోధన తీరుపై పిల్లలకు. వారి తల్లిదండ్రులకు వివరించారు.

నులిపురుగులను నివారిద్దాం

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

- ‘ఆల్బెండజోల్’ పంపిణీకి ఏర్పాట్లు
- ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న వారందరికీ మాత్రలు

భువనగిరి : చిన్న పిల్లల్లో రక్తహీనత, మానసిక, శారీరక ఎదుగుదల లోపించడానికి కారణమయ్యే నులిపురుగుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. జాతీయ హెల్త్ మిషన్‌లో భాగంగా ఏటా జూన్ 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని(డీ వార్మింగ్ డే) నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గురువారం, 27వ తేదీన 19 ఏళ్ల బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సహా అన్ని విద్యాసంస్థల్లో మాత్రల పంపిణీ

ఏడాది నుంచి 19 సంవత్సరాల వయస్సు లోపు 1,57,496 మంది బాలబాలికలు మాత్రల పంపిణీకి అర్హులుగా వైద్యారోగ్య శాఖ అధికారులు గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సహా అన్ని విద్యా సంస్థల్లో కార్యక్రమం నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 24,218, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 1,12 లక్షలు, 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 1,57,496 మంది ఉన్నారు. వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. అలాగే స్కూల్ బయట ఉన్న పిల్లలకు ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల సహాయంతో మాత్రలు వేయనున్నారు.



నులిపురుగుల వ్యాప్తికి కారణాలివే..

- నివాసాలు, పరిసరాల అపరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం.
- కలుషిత నీరు, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల.
- కూరగాయలు శుభ్రంగా కడగకపోవడం, భోజనం చేసే ముందు చేతులను సరిగా శుభ్రం చేసుకోకపోవడం, ఆహార పదార్థాలపై మూతలు ఉంచకపోవడం అని వైద్యులు చెబుతున్నారు.

1నుంచి 19 ఏళ్ల వయస్సులోపు వారు..

సంస్థలు	సంఖ్య	విద్యార్థులు
అంగన్‌వాడీ కేంద్రాలు	901	24,377
ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు	647	65,187
ప్రైవేటు స్కూళ్లు	146	57,141
ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	38	7,035
ప్రైవేట్ జూనియర్ కాలేజీలు	26	3,756
	మొత్తం	1,57,496

తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలి



ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తిచేశాం. పిల్లల్లో నులి పురుగుల వ్యాప్తి చాలా ప్రమాదకరమని తల్లిదండ్రులు తెలుసుకోవాలి. శరీరంలోకి నులిపురుగుల వ్యాప్తి వల్ల పిల్లలు త్వరగా అలిసిపోవడం, ఏకాగ్రత లేకపోవడం, శారీరక ఎదుగుదల ఉండదు. ఈ పరిస్థితినుంచి గట్టెక్కేందుకు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలి. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు పంపిణీ చేస్తారు.

–డాక్టర్ వై.పాపారావు, డీఎంహెచ్‌ఓ

గిరి ప్రదక్షిణ మార్గంలో విద్యుత్ లైట్లు



గిరి ప్రదక్షిణ రోడ్డుకు మరమ్మతులు పూర్తి చేసి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసిన దృశ్యం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి భక్తుల గిరి ప్రదక్షిణకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. స్వాతి నక్షత్రం రోజునే కాకుండా నిత్యం వేకువజామున 4.30 నుంచే భక్తులు గిరిప్రదక్షిణ చేస్తుంటారు. కాగా ఈ మార్గంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లైట్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు దేవస్థానం అధికారులకు విన్నవించారు. ఎట్టకేలకు గిరిప్రదక్షిణ రోడ్డుకు మరమ్మతులు చేయడంతో పాటు బుధవారం రాత్రి లైట్లు కూడా వేయడంతో సమస్య తొలగిపోయింది. భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మూలనపడ్డ పారాఫిట్ లైట్లు

- యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ సమయంలో కోట్ల రూపాయలతో కొనుగోలు
- నిర్వహణ లేమితో రెండేళ్లకే విరిగిపోయిన దీపాలు
- పునరుద్ధరించకుండా ఆలయ అధికారుల చోద్యం

యాదగిరిగుట్ట : యాదాద్రి పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ పరిసరాల్లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి పారాఫిట్ దీపాలు రెండేళ్లకే పనికి రాకుండా పోయాయి. నిర్వహణ లేమితో కొన్ని, విరిగిపోవడంతో మరికొన్ని మూలనపడ్డాయి. భక్తులను ఆకర్షించేందుకు కోట్లాది రూపాయలతో ఈ దీపాలను కొనుగోలు చేశారు. వీటి పునరుద్ధరణపై దేవస్థానం అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి.

రూ.12 కోట్లతో విద్యుదీకరణ పనులు

పూర్తిస్థాయిలో కృష్ణశిలతో అంతర్జాతీయ ఆధ్యాత్మిక క్షేత్రంగా యాదాద్రి రూపుదిద్దుకుంది. ఇందుకు అనుగుణంగా సుమారు రూ.12 కోట్లతో విద్యుదీకరణ పనులు చేపట్టారు. ఆలయం బంగారు వర్ణంలో కనిపించేలా బెంగళూర్‌కు చెందిన లైటింగ్ టెక్నాలజీస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అమెరికా, రష్యన్ టెక్నాలజీతో పసిడి కాంతులు వెదజల్లే లైట్లు ఏర్పాటు చేశారు. ఇందులో ప్యారాఫిట్ వాల్‌పై బిగించిన దీపాలు చాలా వరకు విరిగిపోయాయి. కొన్ని పని చేయడం లేదు.

భక్తులను ఆకట్టుకునేలా..

రాత్రి సమయంలో ఆలయం ఆకర్షనీయంగా కనిపించేలా, భక్తులను ఆకట్టుకునేలా క్యూకాంప్లెక్ పైభాగం, ఉత్తర దిశలో పారాఫిట్ వాల్‌పై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు రెండేళ్లకే మూలనపడ్డాయి. కొన్ని పూర్తిగా విరిగిపోగా మరికొన్ని నిర్వహణ లేకపోవడంతో పని చేయడం లేదు. వాటిని గోల్డ్ క్యూలైన్ల వెనకభాగంలో పడేయడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పూర్తిగా శిథిలం అవుతున్నాయి. వాటిని పునరుద్ధరించకుండా దేవస్థానం అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రూపాయలు వృథా కాకుండా వాటికి మరమ్మతులు చేసి యథాస్థానాల్లో బిగించాలని భక్తులు కోరుతున్నారు.



క్యూలైన్ వెనుక భాగంలో పడేసిన విరిగిపోయిన పారాఫిట్ లైట్లు, స్టాండ్లు



లైట్లు లేకపోవడంతో పారాఫిట్ వాల్‌పై ఖాళీగా కనిపిస్తున్న దిమ్మెలు

వినియోగంలోకి తేవాలి



వందల కోట్ల రూపాయలతో యాదాద్రి క్షేత్రాన్ని అభివృద్ధి చేశారు. ఎక్కడా రాజీ పడకుండా పనులు చేశారు. అందులో భాగంగానే భక్తులను ఆకర్షించేందుకు పారాఫిట్ దీపాలు ఏర్పాటు చేశారు. ఈ దీపాలు వెలిగినన్ని రోజులు ఆలయంతో పాటు యాదగిరిగుట్ట పట్టణ పరిసరాలు కూడా ఎంతో ఆకర్షణీయంగా ఉండేవి. నిర్వహణ లేకపోవడం వల్లే లైట్లు స్వల్ప కాలానికే మూలనపడ్డాయి. వీటికి మరమ్మతులు చేపట్టి తిరిగి యథాస్థానంలో పునరుద్ధరించాలి.

–బబ్బూరి శ్రీధర్, భక్తుడు

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సమ్మె చేయడానికైనా వెనుకాడబోమని 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సాయిబాబా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం 1104 యూనియన్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నారని, అయినా వారి సంక్షేమం గురించి పట్టింపు లేదన్నారు. విద్యుత్ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని, విధి నిర్వహనలో మృతి చెందిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 327 యూనియన్ నుంచి సీహెచ్.శివప్రసాద్, వెంకటేశ్వర్లు 1104 యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.వేణు, ఎస్.వెంకన్న, ఆర్. జనార్దన్‌రెడ్డి, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

అవగాహనతో ‘సికిల్ సెల్’ నివారణ

- డీఆర్‌డీఓ, గిరిజన సంక్షేమ అధికారి కృష్ణన్

భువనగిరిటౌన్ : సికిల్ సెల్ అనీమియా వ్యాధిని నివారించాలంటే అవగాహనతోనే సాధ్యమవుతుందని డీఆర్‌డీఓ, గిరిజన సంక్షేమ జిల్లా ఇన్‌చార్జి అధికారి కృష్ణన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సికిల్ సెల్ డేను పురస్కరించుకొని బుధవారం భువనగిరిలో జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి, వైద్యారోగ్య, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా సికిల్ సెల్ అనీమియా గిరిజనుల్లో ఎక్కువగా ఉందన్నారు. ఈ వ్యాధిని నిర్మూలించాలనే ఉద్దేశంతో 2023 జూలై 1న జాతీయ సికిల్ సెల్ అనీమియా ఎలివేషన్ మిషన్‌ను ప్రధానమంత్రి మోదీ ప్రారంభించారని తెలిపారు. వ్యాధి నిర్మూలనకోసం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేపడుతున్న చర్యల్లో భాగంగా జూలై 3 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వ్యాధి ఎలా సోకుతుంది, లక్షణాలు, నివారణకు తీసుకోవల్సిన చర్యలపై వైద్యాధికారులు అవగాహన కల్పిస్తారని చెప్పారు.

సికిల్ సెల్.. సైలెంట్ కిల్లర్

అనీమియా (రక్తహీనత) అనేది వివిధ రూపాల్లో ఉంటుందని డీఎంహెచ్‌వో పాపారావు పేర్కొన్నారు. అయితే సికిల్ సెల్ అనీమియా సైలెంట్ కిల్లర్‌గా వ్యాప్తి చెందుతుందన్నారు. ఎరరక్త కణాలు సికిల్ (కొడవలి) ఆకారంలోకి మారడం ద్వారా రక్తప్రసరణలో ఆటంకం ఏర్పడుతుందన్నారు. తద్వారా ఆక్సిజన్ అందక సికిల్ సెల్ అనీమియాకు దారితీస్తుందని చెప్పారు. ఇది సోకిన వ్యక్తులు సకాలంలో చికిత్స పొందాలన్నారు. గిరిజనులు ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. నివాసాలతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు భూక్యా సంతోష్‌నాయక్, డీఆర్‌డీఓ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ, గిరిజన సంక్షేమ జిల్లా అధికారి కృష్ణన్

క్లుప్తంగా

సాగర్ వెనుక జలాల్లో మునిగి వ్యక్తి మృతి


మునీర్ (ఫైల్)

చందంపేట: నేరెడుగొమ్ము మండలం వైజాక్ కాలనీ సమీపంలోని నాగార్జునసాగర్ వెనుక జలాల్లో మునిగి బుధవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండకు చెందిన జమీరొద్దీన్, నసీమా బేగం దంపతులకు ముగ్గురు కుమారులు. వీరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరి రెండో కుమారుడైన ఎండీ మునీర్(23) హైదరాబాద్‌లోని ఓ ఆర్టీసీ డిపోలో డిజిల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా దేవరకొండకు వచ్చిన మునీర్ కుటుంబ సభ్యులు సరదాగా గడిపేందుకు బుధవారం నేరెడుగొమ్ము మండలంలోని వైజాగ్ కాలనీ కృష్ణా వెనుక జలాల వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో మునీర్, అతని బావ కలిసి కృష్ణా నది వెనుక జలాల్లోకి దిగారు. ఈత రాకపోవడంతో మునీర్ నీటిలో మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మర పడవల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నూతనకల్: మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన గుండా మురళి(52) సుతారీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల సూర్యాపేట పట్టణానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మురళి తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు వైద్య ఖర్చులు భరించలేక సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తిరుమగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం తొండ గ్రామ శివారులో తాళం వేసిన ఇంట్లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తొండ గ్రామానికి చెందిన గొడుగు యాకస్వామి మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి రెండు తులాల బంగారం, టీవీ, ఫోన్ ఎత్తుకెళ్లారు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ సత్యనారాయణ ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. సూర్యాపేట నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ: కుటుంబ కలహాలతో రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకన్నాడు. ఈ ఘటన దామరచర్ల మండల కేంద్రంలో బుధవారం జరిగింది. రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రం పరిధిలోని ఎర్రనాము కాలనీకి చెందిన మద్దూరి కృష్ణ(52) తాపీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో తిరుపతి నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న పూర్ణ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలట్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత కేసు నమోదు చేశారు.

గంజాయిపై పోలీసుల నిఘా


ఇటీవల దామరచర్లలో పోలీసులు పట్టుకున్న గంజాయి ప్యాకెట్లు


గంజాయి సేవించేందుకు ఉపయోగించే చుట్టమాదిరిగా ఉండే పీకలు

- ముమ్మర తనిఖీలతో నిఘా పెట్టిన పోలీసులు
- రాష్ట్ర సరిహద్దులోనూ గంజాయి రవాణాకు చెక్ పెట్టేలా చర్యలు

మిర్యాలగూడ అర్బన్: గంజాయి దందాకు మిర్యాలగూడ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. టెన్త్, ఇంటర్ చదువుతున్న యువకులు పార్టీల పేరుతో కలుసుకుంటూ మత్తుకు బానిసలుగా మారుతున్నారు. ఇదే అదునుగా భావించి కొందరు గంజాయి వ్యాపారులు 17 నుంచి 25 ఏళ్ల వయస్సున్న యువకులే టార్గెట్‌గా చేసుకుని గంజాయి దందా కొనసాగిస్తున్నారు. ఒక్క మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోనే వెయ్యి మందికి పైగా యువకులు గంజాయికి అలవాటు పడినవారున్నారంటే ఈ దందా ఏవిధంగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

మొదట అలవాటు చేసి..

ఆపై పెడ్లర్లుగా మారుస్తూ..

కొందరు యువతను గంజాయికి బానిసలుగా మార్చి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వాడపల్లి, దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ మండలాలకు కొందరు ఆంధ్రా ప్రాంతానికి చెందిన గంజాయి విక్రయదారులు బస్సులు, రైళ్లు, ద్విచక్రవాహనాల ద్వారా గంజాయి సరఫరా చేసి యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్నారు. కొద్దిరోజుల తర్వాత గంజాయి ఇతరులకు విక్రయించి సంపాదించవచ్చని చెప్పి అదే యువతను పెడ్లర్లుగా మార్చుకుని తమ దందా విస్తరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో యువత సైతం ఈజీ మనీకి అలవాటు పడి చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయి తీసుకొచ్చి తాము ఉంటున్న కాలనీల్లో మరికొందరికి వాటిని అమ్ముతూ మత్తుకు బానిసలుగా మారుస్తున్నారు. శివారు ప్రాంతాలలో గుంపులుగా చేరి యువత గంజాయి సేవిస్తూ.. ఆ మత్తులో ఏం చేస్తున్నారో కూడా తెలియకుండా ప్రవర్తిస్తున్నారు. గంజాయి మత్తులో రోడ్డుపై వెళ్లే వారిపై సైతం దాడులకు పాల్పడుతుండడంతో పాటు మహిళలను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని పలువురు పట్టణవాసులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో..

రాష్ట్ర ప్రభుత్వం గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో జిల్లా పోలీస్ శాఖ ప్రతి పట్టణం, మండల కేంద్రాలు, గ్రామాలల్లో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, సామాజికవేత్తలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి జిల్లాలోకి గంజాయి సరఫరా చేసే వారిపై పోలీసులు నిఘా పెంచారు. బస్సులు, ద్విచక్ర వాహనాలు, రైళ్ల ద్వారా గంజాయి జిల్లాలోకి వస్తుందని గుర్తించి పటిష్ట నిఘా పెట్టారు. అంతేకాకుండా గంజాయి బ్యాచ్‌లు ఉండే ఏరియాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో పోలీసులు సివిల్ డ్రస్‌లో ఉంటూ గంజాయి విక్రయించే వారితో పాటు సేవించే వారిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. ప్రభుత్వం సైతం గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు రావడంతో పోలీసులు సైతం కఠినంగా వ్యవహరిస్తున్నారు. గంజాయి విక్రయించే వారు ఎంతటి వారినైనా వదిలేది లేదని, గంజాయికి అలవాటు పడిన వారిని గుర్తించి అవసరమైతే వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు సైతం నమోదు చేసేందుకు పోలీసులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

నిఘా పెంచాం

యువత మత్తుకు బానిసలుగా మరుకుండా ఇంట్లో తల్లిదండ్రులు వారిని గమనిస్తూ ఉండాలి. వారి ప్రవర్తనలో మార్పు వచ్చినట్లు గమనిస్తే వెంటనే వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు మత్తుకు బానిసలుగా మారకుండా పోలీసు వారి సహాయం తీసుకోవాలి. ఇటీవల పట్టణంలో గంజాయి విక్రయాలతో పాటు సేవించేవారి సంఖ్య పెరిగిందని సమాచారం ఉంది. గట్టి నిఘా పెట్టి గంజాయి విక్రయాలు సాగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. ఇకపై గంజాయి సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నాం.

– కె. రాజశేఖర రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

యోగాతో ఒత్తిడి దూరం


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


భువనగిరి ఖిలా వద్ద విద్యార్థినులు

భువనగిరి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్రాన్స్‌సెండ్ అకాడమీ ఆఫ్ రాక్ క్లైంబింగ్, ఇంక్రిడిబుల్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం భువనగిరి ఖిలా వద్ద విద్యార్థులు యోగసనాలు వేశారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ యోగా కోచ్ రమ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి నిత్యం యోగా చేయడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనంతరం విద్యార్థులచే ఆమె యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, అన్విత, విష్ణు, వినోద్, విజ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ పగిడాల పురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఉపేందర్ (ఫైల్)

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతిచెందాడు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాల గ్రామానికి చెందిన గుండ్లపల్లి ఉపేందర్(39) గ్రామంలో వ్యవసాయంతో పాటు విద్యుత్ మోటార్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఉపేందర్ అపస్మారక స్థితిలో సూర్యాపేట మండలం టేకుమట్లలోని అతని అక్క ఇంటి వద్ద పడి ఉన్నాడు. దీంతో వారు ఉపేందర్‌ను హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి అన్న గుండ్లపల్లి సైదులు గ్రామంలోని ఓ మహిళపై అనుమానం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పథకం ప్రకారమే హత్య..

ఉపేందర్‌ను పక్కా పథకం ప్రకారమే హత్య చేశారని అతడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉపేందర్ గ్రామానికి చెందిన ఓ వివాహితతో గత కొన్నేళ్లుగా చనువుగా ఉంటుండడంతో అటు ఉపేందర్ కుటుంబంలో, ఇటు ఆ వివాహిత కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. సదరు మహిళను వరంగల్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించగా వారికి ఇద్దరు పిల్లలు సంతానం. ఆ మహిళ వ్యవహారశైలిని గుర్తించిన ఆమె భర్త తరచూ గొడవ పడుతుండడంతో ఆమె భర్తను వదిలేసి పిల్లలతో కలిసి గత మూడేళ్లుగా వల్లాల గ్రామంలోని తల్లిగారింటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ఉపేందర్, ఆ మహిళ మధ్య చనువు పెరిగింది. ఇది గమనించిన ఉపేందర్ భార్య నాలుగు నెలల క్రితం భర్తను నిలదీయడంతో ఉపేందర్ తన భార్యను విచక్షణారహితంగా కొట్టాడు. దీంతో ఆమె ముగ్గురు పిల్లలను వల్లాలోనే వదిలి తన తల్లిగారి ఊరైన కట్టంగూరు మండలం ఈదులూరుకు వెళ్లి అక్కడే ఉంటుంది. ఉపేందర్ చనువుగా ఉంటున్న మహిళ కుమార్తెను సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలోని హాస్టల్‌లో చేర్పించేందుకు మంగళవారం వారిద్దరితో కలిసి బైక్‌పై బయల్దేరాడు. మధ్యాహ్నం సమయంలో శాలిగౌరారం మండలంలోని గురుజాల గ్రామ సమీపంలో తుడిమిడి రోడ్డు వెంట ఓ వ్యవసాయ భూమిలో మామిడిచెట్టు కింద ఉపేందర్ ద్విచక్రవాహనాన్ని నిలిపి ఉంచాడు. ఆ తర్వాత సదరు మహిళ, ఆమె కుమార్తె ఎటు వెళ్లారో.. ఏం జరిగిందో తెలియరాలేదు. కొంత సమయం తర్వాత శరీరంపై గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న ఉపేందర్‌ను ఆ మహిళ ఆటోలో నకిరేకల్‌లో క్లినిక్ నడుపుతున్న వల్లాలకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లింది. అక్కడ ఉపేందర్‌ను పరీక్షించిన ఆర్‌ఎంపీ వైద్యుడు పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని ఆ మహిళకు సూచించాడు. దీంతో ఉపేందర్‌ను కట్టంగూరు మండలం చెర్వుఅన్నారంకు చెందిన ఆటోలో సూర్యాపేట మండలం టేకుమట్ల వద్ద ఉన్న ఉపేందర్ అక్క ఇంటికి తీసుకెళ్లగా ఆ ఇంట్లో ఉపేందర్ అక్క, కుటుంబ సభ్యులు లేకపోవడంతో ఉపేందర్‌ను అక్కడే వదిలి వెళ్లిపోయింది. స్థానికులు గమనించి ఉపేందర్ అక్కకు ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో ఆమె ఇంటికి చేరుకొని అపస్మారకస్థితిలో ఉన్న తన తమ్ముడు ఉపేందర్‌ను హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఇదిలా ఉండగా నాలుగేళ్లుగా భర్తతో దూరంగా ఉంటున్న సదరు మహిళ భర్తతో కలిసి మంగళవారం రాత్రి వల్లాలకు వచ్చి బుధవారం ఉదయం కూడా భర్తతో కలిసి గ్రామంలో తిరిగింది. బుధవారం మధ్యాహ్నం ఉపేందర్ హాస్పిటల్‌లో మృతి చెందడంతో సమాచారం తెలుసుకున్న ఆ మహిళ తన భర్త, పిల్లలు, తల్లితో సహా ఇల్లు వదిలి పరారయ్యారు. దీంతో నాలుగేళ్లుగా దూరంగా ఉంటున్న భార్యాభర్తలు ఆకస్మికంగా కలుసుకోవడం, ఉపేందర్ మృతి చెందిన వెంటనే వారు ఇల్లు వదిలి పరారు కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. పథకం ప్రకారమే ఆ మహిళ తన భర్తతో కలిసి ఉపేందర్‌ను కొట్టి హత్య చేశారని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. పరారీలో ఉన్న ఆ మహిళ, ఆమె భర్త పోలీసులకు పట్టుబడితే అసలు విషయాలు వెలుగులోకి రానున్నాయి.

ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతి


రాహుల్ (ఫైల్)

చందంపేట: ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన నేరెడుగొమ్ము మండలంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరెడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గ్రామ సమీపంలోని పుష్కరఘాట్ ప్రాంతం నుంచి వాంకుణావత్ శివ ట్రాక్టర్‌లో ఇసుక లోడ్‌తో వస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న వాంకుణావత్ రాహుల్(16)ను శివ ట్రాక్టర్ ఎక్కాలని చెప్పాడు. ట్రాక్టర్ ఎక్కుతుండగా.. ట్రాలీ భాగం బలంగా తగలడంతో రాహుల్ ట్రాక్టర్ చక్రాల కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని మృతుడి తల్లిదండ్రులు వాంకుణావత్ మకట్ లాల్, పార్వతి, బంధువులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో రాహుల్ మృతదేహాన్ని సందర్శించారు.

శ్రీచైతన్య పాఠశాల సీజ్


విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

వలిగొండ: మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలను ఎంఈఓ శ్రీధర్ బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు పాఠశాలను తనిఖీ చేశామని, పాఠశాల నిర్వాహణకు ప్రభుత్వ నుంచి అనుమతులు లేని కారణంగా జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు పాఠశాలకు సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి వారి భవిష్యత్ నాశనం చేయొద్దని తల్లిదండ్రులకు ఎంఈఓ సూచించారు.

బెల్లం పానకం ధ్వంసం


బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని పడమటి తండాలో నాటుసారా తయారీకి ఉపయోగించేందుకు అక్రమంగా నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం పానకాన్ని బుధవారం దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్‌ఐ మల్లేశం, సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ, సైదులు, నాగరాజు, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నాంపల్లి: పీడీఎస్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా నాంపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వివరాలు.. నాంపల్లి మండలం మేళ్లవాయి గ్రామంలోని ఓ రైస్ మిల్లు నుంచి వీరమళ్ల మల్లికార్జున్ అనే వ్యక్తి 2.5 క్వింటాళ్ల బియ్యంను తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైస్ మిల్లు యాజమాని వీరమళ్ల మల్లికార్జున్, ఆటో డ్రైవర్ వేముల శివాజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

మునుగోడులో 9 క్వింటాళ్లు..

మునుగోడు: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం మునుగోడు పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు నుంచి నార్కట్‌పల్లి రోడ్డులో ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు విశ్వసనీయ వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి నిఘా పెట్టగా సింగారం గ్రామ సమీపంలో రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటో పట్టుబడింది. ఆటోను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎనిమిది గేదెలు మృతి


హుజూర్‌నగర్: మృతిచెందిన గేదెలు

హుజూర్‌నగర్: విద్యుదాఘాదంతో ఎనిమిది గేదెలు మృతి చెందాయి. వివరాలు.. మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు హుజూర్‌నగర్ పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ సమీపంలో దొంతిరెడ్డి సుధాకర్‌రెడ్డి పొలం వద్ద విద్యుత్ స్తంభం విరిగి పడింది. బుధవారం ఉదయం మేతకు వెళ్లిన ఎనిమిది గేదెలు విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుతాఘాతంతో మృతిచెందాయి. పంగ నరసింహారావుకు చెందిన 4 గేదెలు, చాగంటి వెంకన్నకు చెందిన 2 గేదెలు, ఉప్పతల్ల శ్రీనివాస్‌కు చెందిన 2 గేదెలు మృతిచెందాయి. ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రాయినిగూడెంలో మరో గేదె..

గరిడేపల్లి: మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. వివరాలు.. రాయినిగూడెం గ్రామానికి చెందిన మల్లెంపల్లి వరలక్ష్మి తన గేదెను మేత కోసం వదలగా.. ఆ గేదె మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ. 80వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన బెలిదె మనీష్ (24) మంగళవారం అర్ధరాత్రి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ మండలం ఎదులాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వ్యక్తిగత పని మీద బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్లి రాత్రి తిరిగి ఇంటికి వస్తుండగా.. ఎదులాబాద్ వద్ద గుర్తుతెలియని కారు అతడి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మనీష్ తలకు తీవ్ర గాయం కాగా. కాలు విరిగింది. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే శస్త్ర చికిత్స చేయాలని చెప్పారు. మనీష్ కుటుంబం చిన్న కిరాణం షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆపరేషన్ నిమిత్తం రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు పేర్కొన్నారు. దీంతో మెరుగైన వైద్యం కొరకు బాధిత కుటుంబం ఆపన్నహస్తం కొరకు ఎదురు చూస్తున్నారు. దాతలు 9666248232 ఫోన్‌పే, లేదా గూగుల్ పే (బెలిదే మంజుల) చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో నిత్యం ఆదాయం


మాట్లాడుతున్న రైతు వాసికర్ల శేషుకుమార్

నడిగూడెం: సేంద్రియ ఉత్పత్తులతో నిత్యం ఆదాయం పొందవచ్చని సిరిపురంనకు చెందిన అభ్యుదయ రైతు వాసికర్ల శేషుకుమార్ అన్నారు. నడిగూడెం మండల పరిధిలోని సిరిపురంలో గల రైతు వేదికలో నాబార్డు ఆర్థిక సహకారంతో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులకు సేంద్రియ వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయంలో భాగంగా వర్మి కంపోస్టు, వర్మివాష్, జీవామృతం, ఘన జీవామృతం, పంటలకు ఆశించే చీడ, పీడల నివారణకు వివిధ రకాల కషాయాలు తయారు చేసి తోటి రైతులకు విక్రయించి ఆదాయం పొందవచ్చన్నారు. అలాగే తక్కువ భూవిస్తీర్ణంలో సీజనల్‌గా అనేక రకాల పంటలను సాగు చేస్తూ నిత్యం ఆదాయం పొందవచ్చన్నారు. సమీకృత వ్యవసాయంలో పాటించే మెళకువలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధి కొండారెడ్డి, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

డిమాండ్ అధికం.. సీట్లు స్వల్పం!

కస్తూరిబా పాఠశాలల్లో ఖాళీల్లేవ్!

- చేరేందుకు విద్యార్థినులొస్తున్నా.. సీట్లు లేవంటున్న అధికారులు
- 27 మండలాల్లో స్కూళ్లున్నా కొందరికే ప్రవేశ అవకాశం
- మిగతా మండలాల్లోనూ కేజీబీవీలు పెట్టాలంటున్న తల్లిదండ్రులు



మునుగోడు: జిల్లాలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో ప్రవేశానికి అధిక సంఖ్యలో విద్యార్థినుల వస్తున్నా అందరికీ సీట్లు లభించడంలేదు. దీంతో వందలాది మంది విద్యార్థులకు కేజీబీవీల్లో సీట్లు దొరక్క చదువుకు దూరంకావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బాలికల అక్షరాస్యత శాతం పెంచడంతోపాటు, మధ్యలో చదువు మానేసిన బాలికలను చేరదీసి వారికి వసతితో కూడిన విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 12 ఏళ్ల క్రితం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఐదేళ్ల క్రితం అదే పాఠశాలల్లో కళాశాలలను కూడా ప్రారంభించారు. అయితే ఈ పాఠశాలల్లో చేరేందుకు బాలికలు ఆసక్తి కనబరుస్తున్నా చేర్చుకోలేకపోతున్నామని ప్రత్యేకాధికారులు పేర్కొంటున్నారు.

నల్లగొండలో 27 కేజీబీవీలు

నల్లగొండ జిల్లాలో 33 మండలాలు ఉండగా అక్షరాస్యత తక్కువగా ఉన్న 17 మండలాల్లో 2011లో కేజీబీవీలను ప్రారంభించారు. దశల వారీగా మరో 10 పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో కేజీబీవీల సంఖ్య 27కు చేరింది. ఒక్కో పాఠశాలలో 210 మంది నుంచి 215 మంది వరకు చదువుతున్నారు. కేజీబీవీ లేని మండలాల వారు ఈ పాఠశాలల్లోనే చేరేందుకే వస్తున్నారు. దీంతో సీట్లకు డిమాండ్ పెరిగింది. పాఠశాలలు లేని చిట్యాల, నార్కట్‌పల్లి, గట్టుప్పల్, నకిరేకల్, నల్లగొండ మండలాల్లో నూతనంగా పాఠశాలలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మునుగోడు కస్తూరిబాలో ఇదీ పరిస్థితి..

మునుగోడు కేజీబీవీలో 6 నుంచి పదో తరగతి వరకు తరగతికి 40 మంది చొప్పున 200 మందిని చేర్చుకొని వసతితో పాటు విద్యాబోధన చేసేందుకు ఉపాధ్యాయులు, వంట మనుషులను నియమించారు. కానీ ఈ పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు అధిక సంఖ్యలో వస్తుండడంతో తరగతికి ఐదుగురి నుంచి పది మంది వరకు అదనంగా చేర్చుకున్నారు. ఈ ఏడాది ఏకంగా 100 మందికి పైగా చేరేందుకు రావడంతో 6వ తరగతిలో 55 మంది, మిగిలిన తరగతుల్లో ఇద్దరు, ముగ్గురు చొప్పున చేరుకున్నారు. దీంతో ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 235కు పెరిగింది. కేవలం 200 మందికి మాత్రమే సౌకర్యాలు కలిగిన పాఠశాలలో అదనంగా 35 మంది చేరడంతో తోటి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మ మిగతా చోట్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కేజీబీవీలు లేని మండలాల్లో నూతనంగా ఏర్పాటు చేసి ఎక్కువ మంది బాలికలు చదువుకునే అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతికి మించి చేర్చుకున్నాం



ఈ ఏడాది ఒక్క 6వ తరగతికే దాదాపు 120 మందికి పైగా వచ్చారు. అందులో 45 మందిని చేర్చుకున్నాం. మిగిలినవారిని వెనక్కి పంపాము. మిగిలిన తరగతుల్లో ఉన్నతాధికారుల సూచనల ప్రకారం మరో 10 మందిని చేర్చుకున్నాం. ఇప్పటికే పాఠశాలలో అనుమతికి మించి 40 మందిని చేర్చుకున్నాం.

– సంధ్యారాణి, మునుగోడు పాఠశాల ప్రత్యేకాధికారి

సీట్లు లేవని చెబుతున్నారు



మేము బతుకుదెరువు కోసం బావులు తవ్వేందుకు వరంగల్, కరీంనగర్, మహారాష్ట్ర వెళ్తుంటాం. దీంతో మా కుమార్తెను మునుగోడులోని కేజీబీవీలో ఆరో తరగతిలో చేర్పించేందుకు 20 రోజులుగా పాఠశాలకు వస్తున్నాం. కానీ సీట్లు ఖాళీలు లేవని చెబుతున్నారు.

– శివరాత్రి సరిత, విద్యార్థిని తల్లి, రావిగూడెం, మునుగోడు మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థినులను చేర్చుకుంటున్నాం. ప్రతి పాఠశాలలో 200 మంది విద్యార్థినులు ఉండాలి. కానీ కొంతమందికి అదనంగా అవకాశం ఇస్తున్నాం. జిల్లాలో మొత్తం 27 పాఠశాలలు ఉన్నాయి. మరికొన్ని మంజూరు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– సరిత, జీసీడీఓ, నల్లగొండ

నాపరాయి తరలిస్తున్న లారీ స్వాధీనం

అడవిదేవులపల్లి : అక్రమంగా నాపరాయిని తరలిస్తున్న ఓ లారీని మండల పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిట్యాల గ్రామం నుంచి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్లకు నాపరాయిని లారీలో తరలిస్తుండగా మండలంలోని ఉల్సాయిపాలెం కాల్వకట్ట తనిఖీలు నిర్వహిస్తుండగా లారీలో ఉన్న ముగ్గురు పోలీసులను చూసిపరారు, దీంతో అనుమానంతో లారీలో తనిఖీ చేయగా నాపరాయి ఉన్నట్లు గుర్తించి లారీడ్రైవర్ బత్తుల అమరలింగంను అదుపులోకి తీసుకొని బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తంబాకు పట్టివేత

కోదాడరూరల్: కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్‌లో తంబాకును పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాష్ట్ర సరిహద్దులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కంటైనర్‌లో 420 బాక్సుల్లో తంబాకు పట్టుబడినట్లు తెలిపారు. ఈ తంబాకును విశాఖపట్టణం నుంచి నల్లగొండకు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. పట్టుబడిన తంబాకు విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని తెలిపారు. రాజస్తాన్‌కు చెందిన మీనా మనోహర్‌లాల్‌పై కేసు నమోదు చేసి తంబాకును ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.